క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది అంశాలతో రూపొందించిన ఎజెండాపై చర్చించి ఆమోదిస్తామన్నారు. కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపునకు 17 వరకు గడువు

చిలకలపూడి(మచిలీపట్నం): జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించి ఫీజును ఈ నెల 17వ తేదీలోగా చెల్లించాలని డీఈవో తాహెరాసుల్తానా సోమవారం తెలిపారు. మూడు లేదా అంతకంటే తక్కువ సబ్జెక్టులు ఉన్నవారు రూ.110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉన్న వారు రూ.125 చెల్లించాలన్నారు. సంబంధిత పాఠశాల విద్యార్థులు ప్రధానోపాధ్యాయుల ద్వారా ఆన్‌లైన్‌లో 17వ తేదీలోగా దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలని చెప్పారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



పెడన: పట్టణంలోని 21వ వార్డుకు చెందిన సిద్ధాని మహేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా నిమిత్తం తక్షణ సాయం కింద రూ.10 వేలను వార్డు కౌన్సిలర్ పిచ్చిక సతీష్‌బాబు సోమవారం అందజేశారు. మహేష్ తాపీ పనిచేస్తూ జీవిస్తూండేవాడని, అనారోగ్యానికి గురై మృతి చెందాడని సతీష్ తెలిపారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను అందించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ టి.రాజశేఖర్ ఉన్నారు.

లీగల్ ఎయిడ్ సెంటర్ పరిశీలన



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లోని స్పందన విభాగంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ సెంటర్‌ను ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య సోమవారం పరిశీలించారు. ఈ కేంద్రంలో న్యాయ సహాయానికి సంబంధించి వచ్చిన అర్జీలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, స్పందన విభాగం సూపరింటెండెంట్ బేగ్, ఆర్‌ఐ యాకూబ్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి రూ.50 వేల విరాళం



చల్లపల్లి: గ్రామంలోని నిమ్మలతోటలో ఉన్న శ్రీహరిహర పుత్ర అయ్యప్ప క్షేత్రం అభివృద్ధికి గ్రామ ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్(నానీ) – మల్లేశ్వరి దంపతులు సోమవారం రూ.50,116లు విరాళాన్ని అందజేశారు. ఆలయ వ్యవస్థాపకుడు అన్నవరపు పాండురంగారావుకు నానీ దంపతులు ఈ విరాళాన్ని అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు భాను నంబూద్రి సత్కరించి ఆశీర్వచనం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు తుమ్మల వెంకటేశ్వరరావు, ఆకుల ధనుంజయరావు, వేముల హరికృష్ణ, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్ పనుల పరిశీలన



మచిలీపట్నంటౌన్: నగర శివారు గిలకలదిండి సముద్రతీరాన జరుగుతున్న ఫిషింగ్ హార్బర్ పనులను నగరంలోని పలు డివిజన్లకు చెందిన ప్రజలు సోమవారం పరిశీలించారు. ఆయా డివిజన్లలోని సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో గిలకలదిండిలోని పాత ఫిషింగ్ హార్బర్ వద్ద నుంచి బోటులో సముద్రమొగ వద్దకు చేరుకుని అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. కొండరాళ్లతో సముద్రంలోకి దక్షిణ, ఉత్తరం ప్రాంతాల్లో నిర్మిస్తున్న గోడలను, హార్బర్ పనులను పరిశీలించారు. 5, 44 డివిజన్లకు చెందిన ప్రజలతో పాటు వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జిలు మామిడిబత్తుల అజయ్, వేముల వనబాబు, సచివాలయ కన్వీనర్లు గృహ సారథులు పనులను పరిశీలించారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



మచిలీపట్నంలో విద్యార్థులతో మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ



పెడనలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈవో ప్రసాద్

పెడన: గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని పెడన ఇన్‌చార్జి ఎంఈవో కేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. పెడన శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 16వ తేదీ వరకు జరిగే సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించారు. సరస్వతి దేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి సమ్మర్ క్యాంపును ఎంఈవో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లికార్జునరావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రౌతుల ప్రసాద్, గౌరీప్రసాద్, మతీన్‌ఖాన్, శ్రీను, మీర్‌బాబు, సాంబశివరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు

రావివారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని రావివారిపాలెంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ కమిటీ చైర్మన్ బొందలపాటి సుబ్బారావు సూచించారు. గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపును సోమవారం ఆయన ప్రారంభించారు. విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు కంతంనేని కుటుంబరావు, కావూరు కోదండరామయ్య, గ్రంథాలయ అధికారి కె.సుధీర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

మచిలీపట్నంటౌన్: స్థానిక పోర్టురోడ్డులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని డీవైఈవో యువీ సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో జూన్ 11వ తేదీ వరకు విద్యార్థులకు ఈ వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేయటం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు, కథనాలు, సాహిత్యం, కథలు చెప్పటం, చదివించటం, పుస్తక సమీక్షలు, స్పోకెన్ ఇంగ్లిషు, డ్రాయింగ్ విభాగాల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ గ్రంథాలయం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంతో వేసవి సెలవుల్లో కూడా విద్యార్థులు పుస్తకాలు చదవటం వల్ల మరింత విజ్ఞానాన్ని సంపాదిస్తారన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఈ శిక్షణా శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉపగ్రంథాలయ అధికారి ఎంపీడీటీ నగేష్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఈడేపల్లి శాఖ గ్రంథాలయంలోనూ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగించుకోవాలి

గూడూరు: విద్యార్థులు వేసవి సెలవులు వృథా చేయకుండా సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగించుకోవాలని గూడూరు సర్పంచ్ లింగం సులోచన రాణి సూచించారు. గూడూరు శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను సులోచన రాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వం సమ్మర్ క్యాంప్‌లు నిర్వహిస్తోందన్నరు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.శ్రీనివాసరావు, లింగం విజయ్ కుమార్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీటు కోసమే బుద్ధప్రసాద్ పాట్లు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్ బాబు

అవనిగడ్డ: అవనిగడ్డ అసెంబ్లీ సీటు దక్కించుకోవటం కోసమే బుద్ధప్రసాద్ డ్రామాలు ఆడుతున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మోపిదేవి తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీడీపీ ఆధ్వర్యంలో మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. దివిసీమలో పంటలు బాగా పండినప్పటికీ అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి జిల్లా ప్రత్యేక అధికారి లక్ష్మీషాను పంపించి దెబ్బతిన్న పంటల నష్టాన్ని అంచనా వేయించిందన్నారు. రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి ఒక వైపు కృషి చేస్తుంటే దీనికి కూడా రాజకీయాలకు వాడుకునేందుకు అధిష్టానం దృష్టిలో పడి తిరిగి టీడీపీ సీటు దక్కించుకునేందుకు బుద్ధప్రసాద్ ధర్నాలు మొదలు పెట్టారన్నారు.

సవాల్‌కు బుద్ధప్రసాద్ స్పందించలేదు..

ప్రభుత్వం ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తుంటే రైతులు ప్రభుత్వ చర్యలను సమర్థిస్తుంటే కొంత మంది టీడీపీ కార్యకర్తలను వెంట పెట్టుకుని ఉద్యమాలంటూ డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. మరోవైపు గత ప్రభుత్వాలు ఔట్ ఫాల్ స్లూయిసుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే ఆ పనులు చేయించకుండా రూ.160 కోట్ల నిధులను దుర్వినియోగం చేశారని విమర్శించారు. అభివృద్ధి విషయంలో తనతో చర్చకు సవాల్ విసిరితే దానిని స్వీకరించలేకపోయారన్నారు. ఇప్పటికే 22ఏ పరిష్కారం అయిందనీ, అవనిగడ్డ – కోడూరు రోడ్డు నిర్మాణం చేపడతామని, అదే విధంగా ఎదురుమొండి బ్రిడ్జి నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రైతులకు ప్రకృతి వైపరిత్యాల నష్టాన్ని మూడు నెలల్లో పరిష్కరించి పరిహారం అందిస్తున్నారని తెలిపారు.

రైతుల సమస్యల పరిష్కారానికి పెద్దపీట

వైఎస్సార్ సీపీ కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ సీఎం జగన్ సంచలన నిర్ణయాలు తీసుకుంటూ రైతుల సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. గతంలో కొత్తమాజేరు మృతులకు, బోడగుంట అగ్ని ప్రమాద బాధితులకు టీడీపీ నాయకులు సహాయం చేయలేదని, డెల్టా ఆధునీకరణ నిధులు దుర్వినియోగం చేశారన్నారు. చింతలమడ రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం ఆదుకుంటూంటే దీక్షల పేరుతో బుద్ధప్రసాద్ హడావిడి చేశారన్నారు. ఎంపీపీ తుంగల సుమతి, పార్టీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ నజీర్, నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తున్న ఏడీ మనోహర్

కోనేరుసెంటర్: పచ్చిరొట్ట సాగుచేయటం వలన భూసారాన్ని పెంచుకోవచ్చని జిల్లా వ్యవసాయశాఖ ఏడీ వైవీఎస్ మనోహర్ తెలిపారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం మండలంలోని రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మనోహర్ మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాల వినియోగం వలన పొలంలో ఎటువంటి ఎరువులు వాడాలో తెలుస్తుందన్నారు. నేలసారాన్ని మెరుగుపరిచేందుకు, చౌడును అరికట్టటానికి పచ్చిరొట్ట సాగు ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. జీలుగ 10 కేజీలు రూ.395, జనుము 10 కేజీలు రూ.420, పిల్లిపెసర 8 కేజీలు రూ.388లకు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. సబ్సిడీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి జి.వి.శివప్రసాద్, పెడన, గూడురు మండలాల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మోపిదేవికాలనీ(మోపిదేవి): మండల పరిధిలోని మోపిదేవి కాలనీలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పద్మ ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన నాంచారయ్య అనే వ్యక్తిని 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. రోడ్డు దాటుతున్న నాంచారయ్యను ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన కుక్కల గంగాధర్ బలంగా ఢీ కొనడంతో కాలుకు తీవ్రగాయాలు కావడంతో, హాస్పటల్‌కు తరలించారన్నారు. వైద్యుల సూచన మేరకు అవనిగడ్డ నుంచి మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ప్రభుత్వ కృషితో ఉత్తమ ఫలితాలు



టెన్త్ టాపర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు చేసిన కృషితో ఉత్తమ ఫలితాలు లభించాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో టెన్త్ టాపర్లకు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఆంగ్ల విద్యా వ్యవస్థ, నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖల మార్పు, బైజూస్ యాప్, కార్పొరేట్ సౌకర్యాలతో విద్యా ప్రమాణాలు సమకూర్చారని తెలిపారు. అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 592 మార్కులు సాధించిన ప్రేమ్ సాయిని ప్రత్యేకంగా సత్కరించారు. టెన్త్ టాపర్లను అభినందించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ సుమతి, నాయకులు పాల్గొన్నారు.

పెడన: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతిలో టాపర్‌గా నిలిచిన భట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కోడూరు వైష్ణవిని పెడన ఇన్‌చార్జి ఎంఈవో కేఎస్‌వీ ప్రసాద్ అభినందించారు. ఉపాధ్యాయులు మతీన్‌ఖాన్, మీర్‌బాబు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

గోపుర కలశాల ప్రతిష్టోత్సవ ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

నాగాయలంక: స్థానిక పార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన అమ్మవార్ల గర్భాలయాల గోపుర శిఖర కలశాలు, నూతన శ్రీదాసాంజనేయ విగ్రహ ప్రతిష్ఠోత్సవ పూజా కార్యక్రమాలు సోమవారం బ్రహ్మశ్రీ గుండేపూడి నాగరాజశేఖర శర్మ బ్రహ్మత్వంలో జరిగాయి. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా గ్రామ ప్రదక్షిణలు, గణపతిపూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, అఖండ స్థాపన పూజలు రుత్విక్కులు శాస్త్రోక్తంగా జరిపారు. ఈ ప్రత్యేక పూజల్లో 12 మంది దంపతులు పీటలపై కూర్చున్నారు. తదుపరి అంకురారోపణ, జలాధివాసము నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో ఆర్యవైశ్యసంఘం నాయకులు చిట్టా వెంకట పూర్ణచంద్రరావు, తాడికొండ సత్యనారాయణ, దేసు సత్యనారాయణ, చిట్టా హరేకృష్ణ పాల్గొన్నారు. శ్రీనగరేశ్వరునికి అర్చకుడు సుబ్బారావు అభిషేక పూజలు జరిపారు.

చింతలమడ బాధితులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

మృతులకు రూ.3 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల ఎక్స్‌గ్రేషియా



మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న కడవకొల్లు నరసింహారావు(ఫైల్)

చల్లపల్లి: మండల పరిధిలోని లక్ష్మీపురం శివారు చింతలమడ రోడ్డు ప్రమాద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రోడ్డు ప్రమాద మృతులు ఐదుగురి కుటుంబాలకు రూ.3 లక్షలు చొప్పున, 17 మంది క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం మంజూరు చేశారు. ఈ సహాయాన్ని మంగళవారం ఉదయం అవనిగడ్డలో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బాధిత కుటుంబాలకు అందచేయనున్నారు.

అసలు ఆ రోజు ఏం జరిగింది?:

2022 మే 26న జరిగిన రోడ్డు ప్రమాదం 22 కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. చింతలమడ ఎస్సీ కాలనీ నుంచి మోపిదేవి మండలం పెదప్రోలులో జరిగే వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ఆటోలో వెళుతుండగా కాసానగర్ వద్ద ఆటో అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఆటోలో మొత్తం 22 మంది ప్రయాణిస్తుండగా ఐదుగురు మృతి చెందగా, 17 మంది తీవ్ర గాయాలకు గురయ్యారు. రోడ్డు ప్రమాదానికి గురైన విషయాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ప్రభుత్వ సహాయం అందించాలని ఎమ్మెల్యే చేసిన కృషితో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చింతలమడ బాధితులకు సహాయం ప్రకటించారు.

సహాయం వివరాలు

ఆటో ప్రమాదంలో కోన వెంకటేశు, బూరేపల్లి వెంకటేశ్వరమ్మ, బూరేపల్లి వెంకట రమణ, గుర్రం విజయలక్ష్మి, మద్దాల మాధవరావు మృతి చెందగా వారి కుటుంబాలకు రూ.3లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు. ప్రమాదంలో కంచర్ల ప్రభావతి, బండారు కోటేశ్వరమ్మ, పల్లి భాగ్యం, గడ్డం గౌంతమ్మ, లింగం మానసి, లింగం మనీషా, బండారి కోటేశ్వరరావు, గడ్డం వెంకటేశ్వరమ్మ, చిగురుపల్లి నాగమల్లి, కంచర్ల సుప్రియ, బండారు విజయలక్ష్మి, పల్లి సుష్మిత, పాలడుగు గంగాభవాని, పల్లి నాంచారమ్మ, బూరేపల్లి చిన్న శివాజీ, దాసరి పల్లవి, దాసరి సుజాతలకు రూ.50 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు.

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు



చింతలమడ రోడ్డు ప్రమాద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వ సహాయం మంజూరు చేయించిన అవనిగడ్డ ఎమ్మెల్యే రమేష్ బాబుకు ధన్యవాదాలు. మా గ్రామ నిరుపేద ఎస్సీలకు వచ్చిన కష్టాన్ని తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే రమేష్ బాబు సహాయక చర్యలు చేపట్టి అండగా నిలిచారు. సీఎం రిలీఫ్ ఫండ్ సాయం మంజూరు చేయించి ఆదుకుంటున్నారు.

– శీరం వెంకట సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్

ఆసక్తికరంగా క్రికెట్ టోర్నమెంట్



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న కృష్ణంరాజు

మోపిదేవి: మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల స్థాయిలో జరుగుతున్న టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. మలిశెట్టి శ్రీనివాసరావు, కారుమూరి శివనాగరాజు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో కోడూరు జట్టుపై గోల్డెన్ టీమ్ కొత్తపాలెం జట్టు విజయం సాధించిందని నిర్వాహకుడు యడ్ల ప్రసాద్ తెలిపారు. తొలుత బ్యాటింగ్ చేసిన కొత్తపాలెం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 50 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కోడూరు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 40 పరుగులు మాత్రమే చేసిందన్నారు. గోల్డెన్ టీమ్‌కు చెందిన కృష్ణంరాజుకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందజేశారు.

పాలిసెట్ నమూనా పరీక్ష నిర్వహణ

పెడన: మండలంలోని నందమూరు శ్రీవాసవి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఏపీ పాలిసెట్ నమూనా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీకే ప్రసాద్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 17వ తేదీ నుంచి పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ క్యాంపును వాసవి కళాశాలలో నిర్వహించామన్నారు. శిక్షణ పూర్తిఅవ్వగానే సోమవారం నమూనా పరీక్ష పెట్టామని, ఇందులో శిక్షణలో పాల్గొన్న వారితో పాటు ఇతరులు కూడా హాజరయ్యారని పేర్కొన్నారు. 200 మంది విద్యార్థులు ఈ నమూనా పరీక్ష రాశారని తెలిపారు. ఇంగ్లిష్ మీడియంలో పీడీవీ వినయ్, జె.డీస్నీ సంధ్య, ఎస్ రమ్యశ్రీవల్లిలు, తెలుగు మీడియంలో కేఎస్‌ఎస్ కౌసిక్, ఆర్.నాగమణికంఠ, పీబీఎస్‌ఎస్ కుమార్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారన్నారు. వీరికి కళాశాల చైర్మన్ గుడివాడ ప్రసాద్, కార్యదర్శి తాడేపల్లి మెహర్‌బాబా, కరస్పాండెంట్ కె.కుమార్‌బాబు, డైరెక్టర్లు సాయి, బాబాలు అభినందించి బహుమతులను అందజేశారు.

ఘనంగా బార్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణస్వీకారం



బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా కోర్టు ప్రాంగణంలో మచిలీపట్నం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు, ఎన్నికల అధికారి వింజమూరి శివరాం నూతన ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం ఎన్నికైన అధ్యక్షులు తుంగల హరిబాబు మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ ద్వారా కావాల్సిన సహకారం న్యాయమూర్తులకు అందిస్తామన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్‌ను పూర్తిస్థాయిలో ఉండేటట్లుగా చూడాలన్నారు. మహిళా న్యాయవాదుల కోసం ప్రత్యేక బార్‌ను ఏర్పాటు చేయాలని న్యాయమూర్తి దృష్టికి ఆయన తీసుకువచ్చారు. అనంతరం ప్రధాన కార్యదర్శి కొట్టి రఘురాం, ఉపాధ్యక్షుడు మట్టా వెంకటసుబ్బారావు, కోశాధికారి ఎం.ఫణికుమార్, కార్యదర్శి సర్వా లలితకుమారి, లైబ్రరీ కార్యదర్శి పసుమర్తి సూర్యప్రకాశరావు, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యదర్శి టి.రూపారాణి, కార్యవర్గ సభ్యులుగా కె.లోకేష్, కె.పవన్‌కుమార్, టి.గోపీ, బి.రాంభగత్, ఎస్.శశశ్రీ, పి.నరసింహమూర్తి, ఎస్.రమాదేవి, కె.నాగాంజనేయులు, కె.నాగశ్రీనివాసరావులతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పీఎస్‌ఆర్‌కె ప్రసాద్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న కుంభాభిషేక ఉత్సవాలు



ఆలయ విశిష్టతను న్యాయమూర్తి విజయ కళ్యాణికి వివరిస్తున్న అష్టాక్షరీ స్వామిజీ

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఆలయాన్ని నిర్మించి 12 ఏళ్లు పూర్తి కావడంతో కుంభాభిషేక ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో 20 మంది రుత్వికులు యాగశాలలో ప్రత్యేక హోమక్రతువును నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక అలంకారంలో తీర్చిదిద్దారు. రాజ్యలక్ష్మీ, గోదాదేవి అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చనను భక్తిప్రపత్తులతో జరిపారు. మృత్సంగ్రహణ, అగ్నిప్రతిష్టా, మూలమస్త్రహోమం, బలిప్రదానము, బాలభోగ నివేదన, చతుస్థానార్చన, శయ్యాధివాసము కార్యక్రమాలను కనులపండువగా నిర్వహించారు. 12వ తేదీ వరకు ఈ కుంభాభిషేక ఉత్సవాలు కొనసాగుతాయని, చివరి రోజున మహాపూర్ణాహుతి, లక్ష మందికి అన్నసమారాధన నిర్వహిస్తామని స్వామిజీ తెలిపారు. కుంభాభిషేక ఉత్సవాల్లో అవనిగడ్డ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి విజయ కళ్యాణి పాల్గొన్నారు. యాగశాలలో జరుగుతున్న హోమక్రతువును తిలకించారు. ఆలయ విశిష్టతను అష్టాక్షరీ స్వామిజీ జడ్జికి వివరించారు. శ్రీమన్నారాయణుడి 11 అడుగుల ఏకశిలా మూలమూర్తిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన ఉపాలయాలను న్యాయమూర్తి సందర్శించారు.

లయన్స్ క్లబ్‌కు 11 ఉత్తమ అవార్డులు



చల్లపల్లి: విస్తృత సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ శాఖకు లయన్స్ డిస్ట్రిక్ట్ స్థాయిలో 11 ఉత్తమ అవార్డులు లభించినట్లు క్లబ్ జిల్లా నాయకులు తగిరిశ సాంబశివరావు తెలిపారు. స్థానిక క్లబ్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన లయన్స్ డిస్ట్రిక్ట్ సమావేశంలో చల్లపల్లి శాఖ అధ్యక్షుడు ఏఎల్‌ఆర్‌కే ప్రసాద్, కార్యదర్శి నర్రా సాయిబాబు, కోశాధికారి ముమ్మనేని రాజకుమార్ (నానీ) జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులు సాధించారని తెలిపారు. క్లబ్‌కు జిల్లా స్థాయిలో సెకండ్ బెస్ట్ అవార్డు, సాయిబాబుకు ప్రత్యేకంగా డైమండ్ లీడర్ అవార్డు వచ్చిందన్నారు. డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సభ్యులు తగిరిశ సాంబశివరావు, కస్తూరి ప్రసాద్, కాట్రగడ్డ రామ్మోహనరావు(రాము), ఎస్‌జీఏ బాషా, దావులూరి ధనుంజయరావు, కోసూరు శివాజీలకు ఉత్తమ డీసీ అవార్డులు వచ్చాయన్నారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు వరదా హరిగోపాల్, అడపా గురవయ్య, సభ్యుడు మోపిదేవి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్షీరాధివాసం పూజలు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీఅన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మశ్రీ దుర్భా హరిబాబుస్వామి బృందం పర్యవేక్షణలో విగ్రహాలకు మహిళలు క్షీరాధివాసం పూజలు జరిపారు. తొలుత విఘ్నేశ్వరపూజ, మండప దేవతల పూజ, శాంతి హోమం, విగ్రహాలకు సుగంధ ద్రవ్య స్వరాభిషేకం అలంకరణ, రుత్విక్కుల వేదమంత్రాలతో దీక్షా దంపతులతో హోమాలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులుచే ప్రధాన పూజలు నిర్వహించారు.

బందరు డీఎస్పీ మాసూంబాషా రిలీవ్

కోనేరుసెంటర్: బందరు డీఎస్పీ మాసూంబాషా సోమవారం రిలీవ్ అయ్యారు. గత నెల 24వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా బందరు డీఎస్పీగా పనిచేస్తున్న మాసూంబాషాను విజయవాడ ఇంటిలిజెన్స్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే బందరు డిఎస్పీగా మాధవరెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం మాసూంబాషా విధుల నుంచి రిలీవ్ కాగా బందరు డిఎస్పీగా మాధవరెడ్డి బుధవారం బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.